క్లుప్తంగా

అంకాలమ్మ తల్లికి పొంగళ్లు



కుంకుమ బండితో ఆలయానికి వెళ్తున్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో ఆదివారం రాత్రి గ్రామ దేవత అంకాలమ్మతల్లి ఉత్సవం ఘనంగా నిర్వహించి పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్ సమర్పించి మొక్కులు చెల్లించారు. కుంకుమ బండ్లు కట్టి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు పడి గ్రామం పాడి పంటలతో పచ్చగా ఉండాలని వేడుకున్నారు.

22న హనుమాన్ జయంత్యుత్సవాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రేడియో బావి వద్ద గల అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాన్ని ఈ నెల 22న ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బాలకృష్ణారెడ్డి, యర్రారెడ్డి, పెండ్యాల కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ రాత్రి ఆలయం వద్ద భరతనాట్యం, కూచిపూడి సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలకు లక్కీడ్రా ద్వారా పట్టుకుంటే పట్టుచీర కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 22వ తేదీ సాయంత్రం 4 గంటలకు హైవే రోడ్డు నుంచి హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఆలయ ఆవరణలో భక్తులకు అల్పాహారం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

22న హనుమాన్ శోభాయాత్ర

మార్కాపురం టౌన్: విశ్వ హిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో మార్కాపురంలో ఈనెల 22వ తేదీ గురువారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం సాయంత్రం తర్లుపాడు రోడ్డులోని ఆంజనేయ స్వామిగుడి నుంచి శోభయాత్ర ప్రారంభమై పుర వీధుల్లో కొనసాగుతుందని పేర్కొన్నారు. ఊరేగింపు అనంతరం చెన్నకేశవగుడి వద్ద అల్పాహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హిందువులందరూ తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

25న ఉద్యోగుల సంఘ ఎన్నికలు

అర్ధవీడు: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కంభం తాలుకా ఎగ్జిక్యూటివ్ బాడీ ఎన్నికలు ఈ నెల 25న స్థానిక పెన్షనర్ల భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పాండురంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధవీడు, కంభం, బేస్తవారిపేట మండలాల్లో పని చేసే అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వరకుమార్, మార్కాపురం తాలూకా అధ్యక్షుడు చెంచిరెడ్డి, కనిగిరి తాలూకా అధ్యక్షుడు రమేష్‌బాబు ఎన్నికలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల్లో పాల్గొనే వారు తమ వివరాలను ట్రెజరీ ఉద్యోగి రంగయ్య, అటవీ శాఖ ఉద్యోగి ముక్కు ప్రసాద్‌రెడ్డిని సంప్రదించాలని సూచించారు.

21 నుంచి వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వేమయ్యస్వామి

రాచర్ల: మండలంలోని చోళ్లవీడు గ్రామంలో వేమయ్యస్వామి 263వ ఆరాధన మహోత్సవాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. 21వ తేదీ సాయంత్రం 5 గంటలకు కలశ గ్రామోత్సవం, 22వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు గణపతి పూజ, అభిషేకం, ఆఖండస్థాపన, అంకురార్పణ, మండల ఆవాహం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నెమలిగుండ్ల రంగనాయకస్వామి కోలాట బృందంతో కోలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు అన్నసంతర్పణ చేయనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. విద్యార్థులకు కథలు చెప్పడం, వినిపించడం, పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.



ఆటలాడుతున్న విద్యార్థులు

జల్లెడలా పల్లె రోడ్లు!

- పొదిలి మండలంలో రోడ్ల మరమ్మతులు గాలికి..
- వాహనదారులకు తప్పని అవస్థలు



ఓబులక్కపల్లి రోడ్డు



అక్కచెరువు రోడ్డు

పొదిలి: కూటమి పాలనలో రోడ్లను అద్దాల్లా మెరిపిస్తామని బీరాలు పలికిన నాయకులు నేడు కిమ్మనడం లేదు. సంక్రాంతి పండగ నాటికి రాష్ట్రంలో రోడ్లపై ఎక్కడా గుంతలు ఉండకూడని సీఎం చంద్రబాబునాయుడు చేసిన ప్రకటన కూడా మాటలకే పరిమితమైంది. గత ఏడాది డిసెంబర్, జనవరిలో రోడ్లపై గుంతలు పూడ్చే పేరుతో హడావుడి చేసి అంతలోనే కాడి వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా రహదారుల మరమ్మతుల సంగతిని పట్టించుకోకపోవడంతో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. పొదిలి మండలంలో బీటీ రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో తారు రోడ్లు చిల్లుల జల్లెడను తలపిస్తున్నాయి. భారీ పరిమాణంలో గుంతలు ఏర్పడటం, కంకర పైకి తేలడం, మార్జిన్లు కోతకు గురికావడంతో వాహనదారులు భయభయంగా ప్రయాణం సాగించాల్సిన దుస్థితి. జువ్వలేరు, దర్శి రోడ్డు నుంచి అన్నవరానికి రాక పోకలు సాగించే రహదారి, ముసి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి ఏలూరు రోడ్డు, అక్కచెరువు నుంచి రామాపురం వరకు, మార్కాపురం రోడ్డు నుంచి కొండాయపాలెం రోడ్డు, ఓబులక్కపల్లి రోడ్డులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



కొండాయపాలెం రోడ్డు



జువ్వలేరు రోడ్డు

ఘనంగా ఎల్లమ్మతల్లి కొలుపులు



అమ్మవారికి పూజలు చేస్తున్న అన్నా రాంబాబు



అమ్మవారికి పూజలు చేస్తున్న అన్నా రాంబాబు

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపి గ్రామంలో రేణుక ఎల్లమ్మతల్లి కొలుపులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించారు. ముందుగా సర్పంచ్ పెద్ద మస్తాన్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ఘన స్వాగతం పలికారు. అన్నా వెంట స్థానిక నాయకులు నూనె కోటిరెడ్డి, చెవుల రమేష్, వేల్పుల పిచ్చిరెడ్డి, తంగిరాల అశోక్, ఆలయ కమిటీ పెద్దలు ఉన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర దక్కాలి

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో సకాలంలో వర్షాలు కురిసి, పంటలు పండి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని రేణుక ఎల్లమ్మతల్లిని ప్రార్థించినట్లు మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. మార్కాపురం మండలం గజ్జలకొండ పంచాయతీలోని మాలపాటిపల్లి గ్రామంలో సోమవారం గ్రామదేవత రేణుక ఎల్లమ్మతల్లి కొలుపుల మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులైన ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి తదితరులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అన్నా రాంబాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వీఆర్వోలపై పనిభారం తగ్గించాలి



ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఓలు

గిద్దలూరు రూరల్: గ్రామ రెవెన్యూ అధికారులపై పని భారం తగ్గించాలని వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు వై.పి.రంగయ్యయాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. వీఆర్‌ఓలు తమ సమస్యలపై సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ నాయబ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైపీ రంగయ్యయాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌లో భాగంగా ఇటీవల జారీ చేసిన జీఓ ఎంఎస్ 4తో వీఆర్వోలపై పని భారం పెరగడంతో మానసిక ఆందోళనకు గురువుతున్నారన్నారు. రేషనలైజేషన్‌లో మిగిలిపోయిన వీఆర్వోలకు నిర్దిష్టమైన విధివిధానాలతో జీఓ జారీ చేయాలన్నారు. 2019కు పూర్వం ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానంలో గ్రామ రెవెన్యూ అధికారులను మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరామయ్య, సంఘ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అచ్చయ్య, లక్ష్మీదేవి, స్వర్ణ, నాగేంద్ర, కొండయ్య, రాజశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, రామలింగయ్య, ఖాశీంవలి తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు తాగేదెలా?



కుళాయిలో వచ్చిన కలుషిత నీరు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని బీసీ కాలనీలో మంచినీరు కలుషితం కావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం చిన్నపాటి వర్షానికి బీసీ కాలనీలో ఉన్న డ్రెయినేజీ పొంగిపొర్లింది. పైప్‌లైన్ లీకేజీ ద్వారా మురుగు, మంచినీరు మిళితమై కుళాయిల ద్వారా కలుషిత నీరు వస్తోంది. ఆరు నెలలుగా వేధిస్తున్న సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కలుషిత నీటిని వినియోగించి రోగాలబారిన పడుతున్నామని, ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణంలో ఉభయదాతలు

కొనకనమిట్ల: శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో సోమవారం శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ద్వాదశ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామ కృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. కల్యాణ ఉభయ దాతలుగా కొత్తపల్లి గ్రామానికి చెందిన గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, రత్నకుమారి, యక్కంటి చెంచిరెడ్డి, గీతాంజలి, పానుగోటి అనంతరెడ్డి, పల్లవి దంపతులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతోపాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. సప్తాహ మహోత్సవాల సందర్భంగా నిత్యం రామనామ సంకీర్తనలతో భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్న సంతర్పణ చేశారు. మంగళవారం సీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతి రెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా వెంకటేశ్వర కల్యాణం

కంభం: స్థానిక కాపవీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో భక్తులు సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ప్రజల మనిషి సుందరయ్య



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం పార్టీ నాయకులు

మార్కాపురం: ప్రజలే ప్రాణంగా ఉద్యమమే ఊపిరిగా కడదాక నడిచిన పోరాట యోధుడు సుందరయ్య అని సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు పి.రూబెన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూబెన్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లి ప్రజల పక్షాన నిబద్ధతతో పోరాడిన మహానేత సుందరయ్య అని కొనియాడారు. చిన్నతనం నుంచే సామాజిక వివక్ష, మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి పోరాటాలు చేశారన్నారు. కార్మికుల కూలి రేట్లు పెంచడం, పేదలకు భూములు పంచడం, దళితుల సమానత్వం తదితర సమస్యలపై పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అనంతరం 200 మందికి అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జె.రాజు, కాశయ్య, నన్నేసా, మల్లికార్జున, రాజబాబు, భాస్కర్, ఇమ్మానియేల్, శేఖర్, బుజ్జమ్మ, శార, దేవమ్మ, మరియమ్మ, ఎస్తేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీకేపీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



పూజలో పాల్గొన్న ఎస్‌వీకేపీ కళాశాల యాజమాన్యం, సిబ్బంది

మార్కాపురం: స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరి డిగ్రీ కళాశాల(ఎస్‌వీకేపీ)లో అడ్మిషన్లు ప్రారంభించినట్లు కళాశాల సెక్రటరీ సకల నరసింహులు తెలిపారు. సోమవారం కళాశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. సెక్రటరీ మాట్లాడుతూ.. కళాశాలలో బీఏ, బీకాం, బీకాం కంప్యూటర్స్ తదితర కోర్సులకు అడ్మిషన్లు పొందాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితోపాటు పూర్వ విద్యార్థులు బలరామిరెడ్డి, బాలయ్య, శ్రీనివాసరావు, శంకర్, పెనుగొండ కేశవరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్బారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు డీఈఓ కార్యాలయ ముట్టడి

- విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు



నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మార్కాపురం: ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఈనెల 21న తలపెట్టిన డీఈఓ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని మార్కాపురం డివిజన్ ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఒ.వీరారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల్లో సమాంతర మీడియం ఉండాలని తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో విద్యాబోధన కొనసాగాలని, ఉన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలల్లో ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్‌గా ఎస్జీటీలతో పదోన్నతిపై భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ, యూటీఎఫ్, వైఎస్సార్ టీఏ, ఆర్‌యూపీపీ నాయకులు ఎస్కే మౌలాలి, పాపయ్య, డి.వెంకటరెడ్డి, టీవీ రమణ, పి.వెంకటేశ్వర్లు, బి.చిన్నారెడ్డి, ఆర్‌పీబీ శ్రీనివాస్, ఎం.కృష్ణమూర్తి, ఎస్.శ్రీనివాసరెడ్డి, ప్రొవిన్స్ ఎన్.చంద్రశేఖరయ్య, జయరామిరెడ్డి, అల్లూరి శ్రీనివాసులు, బీవీ రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మార్కాపురం టౌన్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా మార్కాపురం పట్టణంలో తిరంగా ర్యాలీని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికులు చూపిన ధైర్యసాహసాలను కొనియాడుతూ 4 మాఢవీధుల్లో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ విజయం మన దేశానికి గర్వకారణమని, ప్రతి భారతీయునికి స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. దేశానికి సేవ చేయాలన్న తపన యువతలో ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, బీజేపీ నాయకుడు పీవీ కృష్ణారావు, స్థానికులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ప్రదర్శన



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

గిద్దలూరు రూరల్: జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కళాజాత బృందం గిద్దలూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ప్రివెన్షన్ యూనిట్ ఎన్జీఓసీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. ఎయిడ్స్ బాధితులను తక్కువ చేసి చూడకూడదని చెప్పారు. హెచ్ఐవీ బాధితులు ఏఆర్‌టీ కేంద్రాల్లో ఇచ్చే మందులను క్రమం తప్పకుండా వాడితే ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు. ఎయిడ్స్‌తో కలిగే నష్టాన్ని వివరించి, ప్రతి ఒక్కరూ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రశేఖర్, కళాజాత బృంద సభ్యులు పాల్గొన్నారు.